# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి... పోలవరం ప్రాజెక్టుల నిర్మాణానికి తోడ్పాటు అందించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు కోరారు.**
2. **తెలంగాణా రాష్ట్రాభివృద్ధికి సహకారం అందించాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.**
3. **విభజన సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్..., తెలంగాణా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఎన్.చంద్రబాబు నాయుడు, ఎ.రేవంత్‌రెడ్డి రేపు హైదరాబాదులో సమావేశమవుతారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన అబుదబి సంస్థకు చేయూత నిస్తామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హామీ ఇచ్చారు.**
5. **టి - 20 వరల్డ్ కప్ సాధించిన టీమిండియా జట్టుకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు 125 కోట్ల రూపాయల నగదు బహుమతి అందించింది.**

==========================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న డిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక సహాయంతో రాష్ట్ర పునర్నిర్మాణానికి అవసరమైన సహకారాన్ని అందించాలని ఈ సందర్భంగా ప్రధాన మంత్రికి చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన ప్రధాన మంత్రికి వివరించారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, బహుళార్థ సాధక పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడానికి తోడ్పాటు అందించాలని చంద్రబాబు నాయుడు కోరారు. కీలక రహదారుల మరమ్మతులు, పట్టణ, గ్రామీణ పేదల ఇళ్ళు, జల్ జీవన్ మిషన్ కార్యక్రమం కింద ఇంటింటికీ తాగు నీరు సరఫరా వంటి కార్యక్రమాలకు సహకారం అందించాలని కూడా చంద్రబాబు నాయుడు నరేంద్ర మోదీనీ కోరారు. ప్రధాన మంత్రితో సమావేశానికి ముందు కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో కూడా చంద్రబాబు నాయుడు సమావేశమయ్యారు.

-------------------------

డిల్లీ పర్యటనలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న కేంద్ర జాతీయ రహదారులు, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో

అపరిష్కృతంగా వున్న పలు జాతీయ రహదారుల నిర్మాణం గురించి చర్చించారు. అనంతపురం–అమరావతి, హైదరాబాదు –అమరావతి జాతీయ రహదారి నిర్మాణాలు త్వరితగతిన సాకారమయ్యేలా చర్యలు తీసుకోవాలని నితిన్ గడ్కరీనీ చంద్రబాబు నాయుడు కోరినట్టు తెలుస్తోంది. ఈ సమావేశంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాస వర్మ, పలువురు రాష్ట్ర పార్లమెంటు సభ్యులు పాల్గొన్నారు.

---------------------------

తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నిన్న డిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో సమావేశమయ్యారు. రాష్ట్రాభివృద్ధికి సంబంచిన అంశాలు, విభజన సమస్యలపై చర్చించినట్టు ప్రధాన మంత్రితో సమావేశానంతరం రేవంత్ రెడ్డి పాత్రికేయులకు తెలిపారు. ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణా రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని కోరుతూ ఈ సందర్భంగా ప్రధాన మంత్రికి వారు వినతి పత్రం అందజేశారు. విభజన సమస్యల పరిష్కారం కోసం కేంద్ర హోం శాఖ చొరవ తీసుకోవాలని కోరామని తెలిపారు.

రాజకీయాలకు అతీతంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు కొనసాగించాలన్న ఉద్దేశ్యంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ .... కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో పాటు వివిధ శాఖల కేంద్ర మంత్రులను కూడా కలుసుకుని వినతి పత్రాలు అందజేశామని రేవంత్ రెడ్డి వివరించారు.

అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ .... గోదావరి పరిసరాలలోని బొగ్గు గనులను వేలం లేకుండా ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణి కాలరీస్ కు కేటాయించాలని కోరామని, రాష్ట్రానికి ఐ.ఐ.ఎం. ఇవ్వాలని, ఐ.టి.ఆర్. ప్రాజెక్టును తిరిగి పునరుద్ధరించాలని ప్రధాన మంత్రిని కోరామని, ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైన అయిదు గ్రామాలను తెలంగాణాలో కలపాలని కూడా విజ్ఞప్తి చేశామని తెలిపారు. తెలంగాణా రాష్ట్రానికి 25 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని, జిల్లాకు ఒక నవోదయ పాఠశాలను ఏర్పాటు చేయాలని, రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని కూడా విజ్ఞప్తి చేశామని భట్టి విక్రమార్క తెలిపారు.

---------------------------

విభజన అంశాలపై చర్చించేందుకు ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ...., తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రేపు హైదరాబాదులో సమావేశమవుతున్నారు. విభజన సమస్యలపై చర్చించడానికి ఉభయులం సమావేశమవుదామనీ చంద్రబాబు నాయుడు రాసిన లేఖకు రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అపరిష్కృతంగా వున్న సమస్యలకు పరిష్కారం సాధించే దిశగా ఇరువురూ ముఖ్య మంత్రుల మధ్య ఈ సమావేశం రేపు అధికారికంగా జరగనున్నది. ఉమ్మడి రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విభజన చట్టంలో పేర్కొన్న కొన్ని అంశాలు రెండు రాష్ట్రాల మధ్య ఇంకా అపరిష్కృతంగానే వున్నాయి.

---------------------------

వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ట్వీట్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యులతో సమావేశమై దేశం, రాష్ట్ర ప్రగతిని వేగవంతం చేయడానికి సంబంధించిన అనేక విషయాలపై చర్చించినట్లు తెలిపారు. దీనికి చంద్రబాబు నాయుడు బదులిస్తూ 'వికసిత భారత్, వికసిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని చేసేందుకు

తాము సర్వ సన్నద్ధంగా  ఉన్నామని, ప్రజల ఆకాంక్షలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని పేర్కొన్నారు.

---------------------------

వైద్య రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు అపార అవకాశాలు వున్నాయని అబుధాబికి చెందిన ఎం – ఎఫ్ – 42 సంస్థ ప్రతినిధులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నిన్న తనను కలుసుకున్న ఎం – ఎఫ్ –  42 సంస్థ ప్రతినిధులకు ఆయన ఈ విషయం తెలియజేస్తూ .... సేవా పరంగా ఆంధ్ర ప్రదేశ్‌లో వున్న అవకాశాలను ఈ సందర్భంగా వివరించారు. జినోమిక్స్, పర్యావరణ మెడ్ టెక్, బయో టెక్ విభాగాలలో అపారమైన అనుభవం వున్న ఎం.ఎఫ్ –42 సంస్థ ప్రతినిధులతో రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలపై చర్చించామని మంత్రి తెలిపారు. పలు దఫాలుగా సంస్థ ప్రతినిధులతో సమావేశం అయిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంటుందని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంస్థకు అన్ని విధాలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చామని సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు.

---------------------------

బ్రిటిష్ వలస పాలన నాటి చట్టాలను ప్రక్షాళన చేస్తూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన నేర చట్టాలపై విజయవాడ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగం ఆధ్వర్యంలో ఆకాశవాణికి సంబంధించిన పార్ట్ టైం కరస్పాండెంట్‌లకు విజయవాడలో ఈరోజు వర్క్ షాప్ జరగనున్నది. ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి శ్రీ సాయి వెంపాటి పరిచయ వాక్యాలతో ప్రారంభమయ్యే ఈ  కార్యక్రమంలో ఆకాశవాణి డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఎం. సోమేశ్వర రావు స్వాగతోపన్యాసం చేస్తారు. విజయవాడ పోలీసు కమిషనర్ పి.హెచ్.డి. రామకృష్ణ ప్రదానోపన్యాసం చేస్తారు. అనంతరం రాష్ట్ర  ప్రభుత్వ అదనపు అభియోగ సంచాలకులు విశిష్ట అతిథిగా హాజరై నూతన నేర చట్టాలను వివరిస్తారు. ఆ తరువాత అతిథులకు సత్కార కార్యక్రమం జరుగుతుంది.

---------------------------

తెలంగాణా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కె. కేశవ రావు నిన్న తన రాజ్య సభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన నిన్న రాజీనామా లేఖను డిల్లీలో  రాజ్య సభ చైర్మన్ జగ్ దీప్ ధంకడ్‌కు అందజేశారు. భారత రాష్ట్ర సమితి నుండి రాజ్య సభకు ఎన్నికైన కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో తన రాజ్య సభ సభ్యత్వాన్ని వదులుకోవాలని నిర్ణయించారు. రాజ్యసభ సభ్యునిగా రెండేళ్ల  పదవీ కాలం వుండగానే కేశవ రావు ఈ నిర్ణయం తీసుకున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ నగరాభివృద్ధికి దోహదం చేసే తూర్పు బై పాస్ రోడ్డుకు కేంద్ర జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారని విజయవాడ లోక్ సభ సభ్యుడు కేశినేని శివనాథ్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు రోజుల డిల్లీ పర్యటనలో భాగంగా నిన్న పలువురు కేంద్ర మంత్రులను కలుసుకున్నారు. నితిన్ గడ్కరీతో సమావేశమైన బృందంలో వున్న కేశినేని శివనాథ్ ఈ విషయం చెప్పారు. విజయవాడలోని ఎన్.టి.ఆర్.  హెల్త్ యూనివర్సిటీ నుండి నిడమానూరు వరకు ఫ్లై ఓవర్ నిర్మించడానికి కూడా కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అనుమతించారని, ఈ అంశాలపై త్వరలో ఆదేశాలు రానున్నాయని శివనాథ్ వివరించారు.

---------------------------

క్రికెట్‌లో టి 20 ప్రపంచ కప్ సాధించి.. విశ్వ వేదికపై భారత కీర్తి పతాకాన్ని రెప రెప లాడించి …. బార్బడోస్ నుండి భారత దేశానికి తిరిగి వచ్చిన టీమిండియా జట్టుకు దేశ ప్రజలు నీరాజనాలు పలికారు. నేరుగా డిల్లి చేరుకున్న టీమిండియా సభ్యులు ప్రధానమంత్రి నరేంద్రమోదీనీ కలుసుకున్నారు. టీమిండియాలోని ఒక్కొక్క సభ్యునితో ప్రధాన మంత్రి ప్రత్యేకంగా మాట్లాడి టీమిండియా సాధించిన ఈ అద్భుత విజయాన్ని ప్రశంసించారు. వారితో ఫోటోలు దిగారు.

ఆ తరువాత టీమిండియా సభ్యులు ముంబై చేరుకున్నారు. ముంబై బీచ్ వద్ద వారికి నగర ప్రజలు ఘన స్వాగతం పలికారు. ముంబై మెరైన్ డ్రైవ్ నుండి వాంఖేడ్ స్టేడియం వరకు టీమిండియా సభ్యుల విజయోత్సవ ర్యాలీ జరిగింది. లక్షలాది మంది ప్రజలు తరలివచ్చి భారీ ఊరేగింపుతో వారిని వాంఖెడ్ స్టేడియంకు తీసుకు వెళ్లారు. “జై భారత్.., జయహో భారత్” అంటూ ముంబై ప్రజల స్వాగత నినాదాలతో నగరం మార్మోగింది. వాంఖేడ్ స్టేడియంలో అశేష ప్రజానీకం మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో క్రికెట్ జట్టు సభ్యులకు భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు 125 కోట్ల రూపాయల చెక్కును అందజేసింది.

========================